వర్ధన్నపేట: మాట్లాడుతున్న మహేందర్ మాదిగ

నమ్మించి మోసం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్

వర్ధన్నపేట, మార్చి 16: ఎస్సీ వర్గీకరణ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని మాదిగ సామాజిక వర్గాన్ని నమ్మించి మోసం చేస్తున్నాడని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్‌మాదిగ ఆరోపించారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు వర్ధన్నపేట అంబేద్కర్ సెంటర్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం ఆరో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎర్ర సంతోష్ మాదిగ అధ్యక్షతన జరిగిన దీక్షలకు మహేందర్ హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్ పాలనలో సామాజిక న్యాయం కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని చెప్పుతున్న ముఖ్యమంత్రి వర్గీకరణ మేరకు ఉద్యోగాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. డీఎస్సీ ఫలితాల్లో ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చి మాదిగలకు న్యాయం చేస్తానని అసెంబ్లీ సాక్షిగా మాట ఇచ్చి మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల పెంపు పేరుతో మరోసారి మోసం చేయబోతున్నారని, మాదిగలు, ఉపకలాలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు గోలి సుధాకర్, మరుపట్ల అంజయ్య, ముత్యాల మల్లేశ్, చాడ కరుణాకర్, చంద్రమౌళి, రాజు, అనిల్, తుమ్మల కుమార్, మేడ బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై తిరుగుబాటు తప్పదు

నర్సంపేట/వరంగల్: ఎస్సీ వర్గీకరణ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేయకపోతే సీఎం రేవంత్‌రెడ్డిపై తిరుగుబాటు తప్పదని మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ నాయకుడు మంద కుమార్‌మాదిగ హెచ్చరించారు. పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలో ఆరో రోజుకు చేరాయి. గ్రూప్-1, 2, 3తో పాటు ఇతర ఉద్యోగ నియామకాలు వర్గీకరణ తర్వాతే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రతినిధి కల్లెపల్లి ప్రణయ్‌దీప్, డీబీడీపీఎస్ ప్రజా దండోరా జాతీయ అధ్యక్షుడు అందె రవి, మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు తడుగుల విజయ్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్దూ, వీహెచ్ జిల్లా అధ్యక్షుడు బాబు రాజు, రాజశేఖర్, గవర్‌సింగ్, విజయ్, ప్రవీణ్, రాజు, యాకయ్య, సాంబలక్ష్మి, స్వరూప, రత్నం, సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే, వరంగల్‌లోని జీడబ్ల్యూఎంసీ కార్యాలయ ఆవరణలో చేపట్టిన దీక్షలను ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇసంపల్లి రాజు ప్రారంభించారు. జనాభా దామాషా ప్రకారం ఎస్సీ వర్గీకరణ అమలు చేసే వరకు పోరాటం ఆగదన్నారు. మాదిగలకు ఇచ్చిన హామీలను సీఎం అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాణిక్యం, రమేశ్, చంద్రమౌళి, రవి, ఏలియా, రామకృష్ణ పాల్గొన్నారు.

వాజ్‌పేయి ఆశయ సాధనకు కృషి చేయాలి

మాట్లాడుతున్న చెన్నమనేని విద్యాసాగర్‌రావు

వరంగల్, మార్చి 16: మాజీ ప్రధాన మంత్రి, భారతరత్న అటల్ బిహారి వాజ్‌పేయి ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు పిలుపునిచ్చారు. వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం డీ కన్వెన్షన్ హాల్‌లో మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాంనాయక్ అధ్యక్షతన ఆదివారం అటల్‌జీ యాదిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విద్యాసాగర్‌రావు హాజరై మాట్లాడారు. వరంగల్‌లో వాజ్‌పేయి పేరున స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. దాని కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఇటీవల మాతృవియోగం పొందిన మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు నిశిధర్‌రెడ్డి, బలరాం, వెంకటేశ్వర్లు, సోదా రమేశ్, రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎండుతున్న వరి పొలాలు

ఖానాపురం, మార్చి 16: పాకాల ఆయకట్టులో సంగెం కాల్వ పారకంలో పెద్దమ్మగడ్డ శివారులోని వరిపొలాలకు సక్రమంగా నీరందక ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. వంతుల వారీగా నీళ్లు పారించుకునే క్రమంలో సరిగా నీరందడం లేదని వాపోతున్నారు. అదేవిధంగా వారానికి ఒకసారి మాత్రమే పొలాలకు పారిస్తున్నామని, దీంతో పొలాలన్నీ బీటలు వారుతున్నాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవసరానికి సరిపడా నీరు అందించి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

పాకాల ఆయకట్టు పెద్దమ్మగడ్డ శివారులో ఎండిపోతున్న వరి పొలం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★Wanted Female Marketing Executives for a Reputed Pvt. Ltd Company. Salary : 12,000/- to 20,000/-, Quli: Inter/Degree, Age: 24 to 30. Cont: 7660009009, 7036229903

NTW-000

PLOT FOR SALE

★జనగామ కలెక్టరేట్‌కు & కొత్త విమానాశ్రయం, Textile Parkకు అతి చేరువలో DTCP/ RERA approved Layoutతో గజం కేవలం 5,499/-కి పొందండి with all Developmenting. Contact: 7780324073.

NT-330714

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

శిక్షణకు కోచ్‌లు కరువు

- జిల్లాకు 8 మంది అవసరం
- క్రీడల్లో రాణించలేకపోతున్న పిల్లలు
- ప్రభుత్వం చొరవ చూపాలని వేడుకోలు

జిల్లా యువజన, క్రీడల అధికారి కార్యాలయం

కరీమాబాద్, మార్చి 16: విద్యార్థులు, యువకులు ఆటల్లో రాణించాలంటే శిక్షణ అవసరం. శిక్షణ పొందాలంటే కోచ్‌లు ఉండాలి. కానీ, శిక్షకుల నియామకం, వసతుల కల్పనలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చిన్నతనం నుంచే శిక్షణ పొందితే సబ్ జూనియర్, జూనియర్, అండర్-14, అండర్-17, అండర్-19, యూనివర్సిటీ స్థాయి.. ఇలా ఒక్కో విభాగంలో పోటీపడుతూ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి వెళ్లొచ్చు. క్రీడాకారుడికి ఆటలపై ఆసక్తి ఎంత ముఖ్యమో.. క్రీడల్లో మెళకువలు నేర్పే గురువూ అంతే ముఖ్యం. కానీ, గురువు లేకపోవడంతో ప్రతిభ ఉన్నా ఆటల్లో రాణించలేకపోతున్నామని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎనిమిది మందికి ఒక్కరూ లేరు..

జిల్లాలో ఉన్న జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో చిన్నారులు, క్రీడాకారులకు నిరంతరం శిక్షణ ఇచ్చి, వారు ఆటల్లో రాణించేలా పరికరాలు, పోషకాలు అందించడంతోపాటు క్రీడలకు సంబంధించిన కోచ్‌లను ఏర్పాటు చేయడం ప్రభుత్వ బాధ్యత. కానీ, ప్రస్తుతం జిల్లాలో ఇవేవీ కానరావడం లేదు. జిల్లాస్థాయిలో వివిధ క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు 8 మంది కోచ్‌లు అవసరం ఉన్నట్లు క్రీడాకారులు చెబుతున్నారు. కానీ, ఒక్క కోచ్ కూడా లేకపోవడం శోచనీయం. కోచ్‌లను కేటాయించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని, కనీసం ఉన్నతాధికారులు ఆలోచించడం లేదని విమర్శిస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో జిల్లా నుంచి క్రీడల్లో పాల్గొనే, రాణించే క్రీడాకారులు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని కోచ్‌లను నియమించాలని వారు కోరుతున్నారు.

శిక్షణ ఇస్తే రాణిస్తారు..

జిల్లాలో ప్రతిభ ఉన్న క్రీడాకారులకు కొదవలేదు. వారికి సరైన శిక్షణ ఇస్తే ఆటల్లో రాణిస్తారు. కానీ, కోచ్‌లు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. జిల్లాకు కోచ్‌లను కేటాయించాలని ఉన్నతాధికారులు, ప్రభుత్వాన్ని కోరాం. క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. సరైన వసతులు, అవసమైన కోచ్‌లను అందిస్తే జిల్లా, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో రాణించేలా క్రీడాకారులను తయారు చేయగలం.

– సత్యవాణి, జిల్లా యువజన, క్రీడల అధికారి

పెళ్లి కొడుకు ఫ్రెండ్స్ హంగామా

- భోజనం వద్ద గొడవ.. పలువురిపై దాడి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన కుటుంబ సభ్యులు

సంగెం, మార్చి 16: వివాహం సందర్భంగా భోజనం వద్ద పెళ్లి కొడుకు స్నేహితులు హంగామా చేశారు. గొడవకు దిగి పలువురిపై దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా ములుగు గణపురం మండలం గాంధీనగర్‌కు చెందిన కప్పల సంతోష్ కుమారుడు ప్రశాంత్‌సాయి వివాహం సంగెం మండలంలోని ఆశాలపల్లిలో ఆదివారం జరిగింది. భోజనాల సందర్భంగా పెళ్లి కుమారుడి మిత్రులు గొడవకు దిగారు. గమనించిన పెళ్లి కుమారుడి బాబాయ్ కప్పల శంకర్ వచ్చి ఎందుకు గొడవ పడుతున్నారని వారించాడు. దీంతో ఇల్లంద కొత్తగూడేనికి చెందిన సిదిరాల శ్రీకాంత్ తన మిత్రులతో కలిసి శంకర్‌పై కుర్చీలతో దాడి చేయగా, రక్తస్రావమైంది. అలాగే, పెళ్లి కుమారుడి తండ్రి కప్పల సంతోష్, ఆయన కుమార్తె అంబటి అంజశ్రీని సైతం కుర్చీలతో కొట్టడంతో వారు కిందపడిపోయారు. దీంతో సిదిరాల శ్రీకాంత్, అతడి మిత్రులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కప్పల శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చేనేత జౌళిశాఖ ఏడీ రాఘవరావు బదిలీ

పోచమ్మమైదాన్, మార్చి 16: వరంగల్ చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకుడు రాఘవరావు రాజన్న సిరిసిల్ల జిల్లాకు బదిలీ అయ్యారు. అక్కడ పని చేస్తున్న అధికారిని బదిలీ చేశారు. ఆయన స్థానంలో రాఘవరావు విధులు నిర్వర్తించనున్నారు. అలాగే, వరంగల్ చేనేత జౌళిశాఖ కార్యాలయంలో ఆయన ఏడీగా ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టనున్నారు.

రాంచంద్రాపురంలో ఒకరి అదృశ్యం

సుధాకర్‌రావు (ఫైల్)

సంగెం, మార్చి 16: మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రాంచంద్రాపురం గ్రామానికి చెందిన తోపుచర్ల సుధాకర్‌రావు(55) ఈ నెల 13న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం ఎంత వెతికినా లభించలేదు. అతడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

చెన్నారావుపేట, మార్చి 16: మండలంలోని ఉప్పరపల్లి, చెన్నారావుపేట సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనున్నట్లు అధికారి తిరుపతి తెలిపారు. అమీనాబాద్, ఉప్పరపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో 33/11కేవీ లైన్లలో మరమ్మతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నేడు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కరెంట్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేటి నుంచి కుష్టు నిర్ధారణ సర్వే

15 రోజుల కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి

వరంగల్ చౌరస్తా, మార్చి 16: జిల్లావ్యాప్తంగా సోమవారం కుష్టు వ్యాధి నిర్ధారణ, అవగాహన సర్వే ప్రారంభం కానుంది. ఈ మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యంలో ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్యాధికారులు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. ఇందుకు సంబంధించి వివరాల సేకరణ, నమోదు ప్రక్రియపై ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లకు శిక్షణ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. సర్వేలో భాగంగా సిబ్బంది, ఆరోగ్య పర్యవేక్షకులు ఉదయం 6 నుంచి 9 గంటల మధ్యలో ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని పరిశీలించి, శరీరంపై మచ్చలు ఉంటే వైద్య పరీక్షల ద్వారా నిర్ధారిస్తారని నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఆచార్య తెలిపారు. వ్యాధి నిర్ధారణ జరిగితే ప్రభుత్వం నుంచి ఉచితంగా మందులు అందించడం, ఆరోగ్య కార్యకర్తలు నిరంతర పర్యవేక్షణ కోసం వివరాలు నమోదు చేసుకోవడంతోపాటు వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారని వెల్లడించారు. కుష్టును సరైన సమయంలో గుర్తించి వైద్యం అందిస్తే వ్యాధి నయం అవుతుందని వివరించారు. సర్వే ప్రక్రియ ఈ నెల 31వ తేదీ వరకు 15 రోజులపాటు జరుగుతుందని పేర్కొనారు. సర్వేకు అవసరమైన వస్తు సామగ్రిని ఆయా ఆరోగ్య కేంద్రాలకు అందించినట్లు నోడల్ అధికారి తెలిపారు.

గ్రూప్స్‌లో మెరిసిన రైతు బిడ్డ

నాలుగేళ్లలో ఆరు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక

అశోక్

చెన్నారావుపేట, మార్చి 16: ఇటీవల విడుదలైన గ్రూప్-2, గ్రూప్-3 పోటీ పరీక్షల్లో మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన రైతుబిడ్డ వరంగంటి అశోక్ స్టేట్ ర్యాంక్‌లు సాధించాడు. గ్రామానికి చెందిన వరంగంటి పద్మ-కుమారస్వామి దంపతుల రెండో కుమారుడు అశోక్ నాలుగేళ్ల కాలంలో ఆరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. నాలుగేళ్ల క్రితం ఒకేసారి ఏఆర్ ఎస్సై, రైల్వే, వీఆర్ఏ, గ్రూప్-4 ఉద్యోగాలు సాధించాడు. ఇందులో ఏఆర్ ఎస్సై పోస్టును ఎంపిక చేసుకొని ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలో విధులు నిర్వర్తిస్తున్నాడు. అనంతరం గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలకు హాజరై స్టేట్ ర్యాంక్‌లు సాధించాడు. గ్రూప్-2 పరీక్షలో 401 మార్కులతో జనరల్ కేటగిరీలో 57వ ర్యాంక్, బీసీ-ఏలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. అలాగే, గ్రూప్-3 పరీక్షలో 320 మార్కులతో భద్రాద్రి జోన్ టాపర్‌గా నిలిచాడు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన అశోక్ తల్లిదండ్రులతోపాటు గ్రామానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చాడని స్థానికులు అభినందించారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

మందులు అందజేస్తున్న డాక్టర్ రమ్య

గిర్మాజీపేట, మార్చి 16: నగరంలోని పేద ప్రజలు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని గ్రావిడ్ హోమ్స్ హాస్పిటల్ వైద్యురాలు వందనశెట్టి రమ్య సూచించారు. మండిబజార్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ఆవరణలో ఆదివారం రెవ. డాక్టర్ బి వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రావిడ్ హోమ్స్ హాస్పిటల్ యాజమాన్యం మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించింది. ఈ శిబిరంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. చర్చి ప్రెసిడెంట్ పీఆర్ విజయ్‌కుమార్, విల్సన్, శ్రీనివాస్, కరుణాకర్, జన్ను శ్యామ్, రవి, జోసెఫ్, హాస్పిటల్ ఏవో రాంరెడ్డి, మేనేజర్ రంజిత్, అనిల్, రాజేశ్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

దుగ్గొండి: సాయికుమార్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

రాయపర్తి, మార్చి 16: జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. రాయపర్తి మండల కేంద్రం శివారులోని వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై శనివారం రాత్రి గీత కార్మికుడు మృతి చెందాడు. ఎస్సై కొంగ శ్రవణ్‌కుమార్ కథనం ప్రకారం.. కొత్త రాయపర్తికి చెందిన బొమ్మెర సతీశ్‌కుమార్ గౌడ్(38) శనివారం సాయంత్రం కల్లు తీసేందుకు తన బైక్‌పై తాటి వనానికి వెళ్లాడు. తాటి చెట్లు ఎక్కి కల్లు తీసిన అనంతరం రాత్రి 11 గంటల ప్రాంతంలో బైక్‌పై ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో అతడిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సతీశ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి భూపాల్‌స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి తల్లిదండ్రులతోపాటు 9 ఏళ్ల కుమార్తె ఉంది. కాగా, సతీశ్‌కుమార్ భార్య ఎనిమిదేళ్ల క్రితమే వ్యాధితో మృతి చెందింది.

సతీశ్‌కుమార్ (ఫైల్)

స్తంభాన్ని ఢీకొని యువకుడు..

దుగ్గొండి: విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడు మృతి చెందాడు. మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన బొంతల సాయికుమార్(28) శనివారం రాత్రి 9 గంటల సమయంలో పెంచికల పేటకు వెళ్లి తిరిగి బైక్‌పై వస్తున్నాడు. గ్రామ కూడలిలోకి చేరుకోగానే అతడు కరెంట్ స్తంభాన్ని బలంగా ఢీకొన్నాడు. దీంతో సాయికుమార్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నర్సంపేట యువజన విభాగం కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, క్లస్టర్ ఇన్‌చార్జి కంచరకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, యూత్ విభాగం మండల అధ్యక్షుడు నగనబోయిన తిరుపతియాదవ్, మాజీ సర్పంచ్ మోడెం విద్యాసాగర్, మెహన్‌రావు, పొగాకు బాలకృష్ణ, అంబీర్ రమేశ్ పాల్గొన్నారు.

రైలు నుంచి కిందపడి ఒకరు..

ఖిలావరంగల్: వేగంగా వెళ్తున్న రైలు నుంచి గుర్తుతెలియని వ్యక్తి కిందపడి మృతి చెందిన ఘటన ఆదివారం నెక్కొండ రైల్వేస్టేషన్ యార్డులో జరిగింది. వరంగల్ జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ పీ రాజు కథనం ప్రకారం.. సుమారు 40 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి రైలులో ప్రయాణిస్తున్నాడు. నెక్కొండ రైల్వేస్టేషన్ యార్డుకు చేరుకోగానే ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు బెల్లం రంగు ప్యాంటు, క్రీమ్ కలర్ షర్టు ధరించి ఉన్నాడు. కుడి చేతి మట్టపై పీ అశోక్ అని ఇంగ్లిష్‌లో పచ్చబొట్టు ఉంది. అలాగే, మృతుడి వద్ద సికింద్రాబాద్ నుంచి విజయవాడకు రైల్వే జనరల్ టికెట్ ఉంది. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు.

పగిలిన మిషన్ భగీరథ పైపులు

పర్వతగిరికి నిలిచిపోయిన నీటి సరఫరా

రాంధాన్‌తండా శివారులో పైపులైన్ పగిలిపోవడంతో ఎగిసిపడుతున్న తాగునీరు

వర్ధన్నపేట, మార్చి 16: రోడ్డు నిర్మాణంలో భాగంగా కల్వర్టు కోసం పనులు చేస్తుండగా పైపులైన్ పగిలిపోయి నీరు వృథాగా పోతున్నది. ఈ ఘటన మండలంలోని ఇల్లంద-రాంధాన్‌తండా ప్రధాన రోడ్డులో ఆదివారం జరిగింది. మండలంలోని ఇల్లంద నుంచి రాంధాన్‌తండా మీదుగా పర్వతగిరి మండలం రోళ్లకల్ వరకు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రాంధాన్‌తండా సమీపంలో కల్వర్టు నిర్మాణం కోసం పాత కల్వర్టు మట్టిని తీస్తున్నారు. ఈ క్రమంలో పర్వతగిరి మండలానికి నీటి సరఫరా చేసే మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయింది. పైపు నుంచి భారీగా నీరు బయటకు వస్తూ పంట పొలాల్లోకి చేరుతున్నది. దీంతో పర్వతగిరి మండలానికి నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

సమీక్షలో ఆర్డీఎంఏ షాహిద్

మాట్లాడుతున్న ఆర్డీఎంఏ మసూద్

నర్సంపేట, మార్చి 16: పట్టణ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని రీజనల్ డైరెక్టర్ కమ్ అఫిలేట్ కమిషనర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(ఆర్డీఎంఏ) షాహిద్ మసూద్ కోరారు. పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో ఇంటి, నల్లా పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజు 100 శాతం చెల్లించాలన్నారు. వాణిజ్య, వ్యాపారం చేసే వాళ్లందరూ విధిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని కోరారు. మొండి బకాయిదారులు త్వరగా పన్నులు చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అన్ని రకాల పన్ను వసూళ్లలో అధికారులు, సిబ్బంది వేగం పెంచాలని ఆదేశించారు. 2020లో ఎల్ఆర్ఎస్ కోసం రూ. 1000 చెల్లించి రిసిప్ట్ పొందిన వారు వెంటనే సరైన డాక్యుమెంట్స్ తీసుకొచ్చి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ సెంటర్‌లో ల్యాండ్స్‌ను రెగ్యులేషన్ చేయించుకోవాలని సూచించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో నర్సంపేట మున్సిపల్ కమిషనర్ ఇసంపెల్లి జోనా, మేనేజర్ టీ సంపత్‌కుమార్, జేఏవో రజిని, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.నాగరాజు, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ కందుల రాజేశ్, టీవో రమ్యకృష్ణ, టీపీఎస్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ర్యాంక్ కోసం కృషి చేయాలి

మేయర్ గుండు సుధారాణి

పబ్లిక్ టాయ్‌లెట్స్‌ను పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్, మార్చి 16: స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ మెరుగైన ర్యాంక్ సాధించేలా కృషి చేయాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. బల్దియా ఆవరణలోని షీ టాయ్‌లెట్‌తోపాటు హనుమకొండలోని డీఈవో కార్యాలయం, అదాలత్ సెంటర్‌లోని పబ్లిక్ టాయ్‌లెట్స్‌ను ఆదివారం ఆమె పరిశీలించారు. పబ్లిక్ టాయ్‌లెట్స్ నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో గ్రేటర్ కార్పొరేషన్‌కు ఓడీఎఫ్ ++ సర్టిఫికెట్ వచ్చేలా ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ మెరుగ్గా ఉండాలన్నారు. పబ్లిక్ టాయిలెట్స్‌లో ఏమైనా మరమ్మతులు చేయాల్సి వస్తే వెంటనే చేపట్టాలన్నారు. అదాలత్ సెంటర్‌లోని ప్రజా మరుగుదొడ్లు నీటి సౌకర్యం లేక మూసివేశామని తెలియడంతో వెంటనే బోరు వేసి వినియోగంలోకి తేవాలని అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సంబంధించిన అంశాలను ప్రజా మరుగుదొడ్లలో స్పష్టంగా పెయింటింగ్ చేయించాలని సూచించారు. మేయర్ వెంట ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ప్రజారోగ్య సిబ్బంది ఉన్నారు.

లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కొమ్మాల జాతరకు పోటెత్తిన భక్తులు

గీసుగొండ, మార్చి 16: కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతరకు మూడో రోజు ఆదివారం కావడంతో స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మండలంతోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే భక్తులు క్యూలో గంటల తరబడి వేచి ఉండి స్వామి వారిని దర్శించుకునారు. అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి